నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 12 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

# సమస్యల స్వాగతం


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ రోడ్డు హైస్కూల్‌లోని తరగతిగదిలో స్టేజీ పనులు చేపడుతున్న కూలీలు

**నేటి నుంచి బడులు పునఃప్రారంభం కానున్నాయి. బడిగంట మోగేందుకు వేళైనా.. పలు పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరం కోటి ఆశలతో తల్లిదండ్రులు వారి పిల్లలను స్కూళ్లకు పంపించేందుకు సిద్ధమయ్యారు. కానీ సవాళ్ల మధ్య చదువులు సక్రమంగా సాగేనా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొనసాగిన మన ఊరు-మన బడి కార్యక్రమం అటకెక్కగా.. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నాడు కళకళలాడిన బడులు నేడు వసతులు కరువై వెలవెలబోతున్నాయి. దీనికి తోడు బడుల ప్రారంభంలోనే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ తెరపైకి రావడంతో చదువులెలా సాగుతాయేమోనన్న అయోమయం తల్లిదండ్రుల్లో నెలకొన్నది.**

*- నాగర్‌కర్నూల్, జూన్ 11 (నమస్తే తెలంగాణ)*

- సవాళ్ల మధ్య బడుల పునఃప్రారంభం
- నాడు కళకళ.. నేడు వెలవెల
- అటకెక్కిన మన ఊరు–మన బడి
- కొనసాగని 'అమ్మ ఆదర్శ' పాఠశాలలు
- అసంపూర్తి భవనాలు.. పూర్తికాని పనులు
- ఉపాధ్యాయ బదిలీలతో చదువు సాగేనా..?

2024–25 విద్యా సంవత్సరం బుధవారం నుంచి ప్రారంభమవుతున్నది. వేసవి సెలవులు ముగిశాక పాఠశాలలు తెరుచుకోనున్నాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపించేందుకు సిద్ధమయ్యారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, రెండు జతల యూనిఫాంలను ఉచితంగా అందించనున్నారు. ఈక్రమంలో ఈ ఏడాది స్కూల్స్ విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. ఇందుకు ప్రధానంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులే కారణం. ఇప్పటివరకు ఈ ప్రక్రియ పెండింగ్‌లో ఉండగా పాఠశాలలు తెరిచే వారం ముందే ప్రారంభం కావడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ బడుల్లో రోజుకు 90శాతం హాజరు ఉండేలా విద్యాశాఖ విధానపరమైన నిర్ణయాన్ని తీసుకున్నది. ఈక్రమంలో టీచర్ల పదోన్నతులు, బదిలీలపై దృష్టి సారించడంతో పాఠశాలలకు ఆరంభంలోనే ఆటంకాలు కలగనున్నాయి. ప్రభుత్వం చేపట్టిన బడిబాట ఈనెల 6నుంచి ప్రారంభమై 19వ తేదీ వరకు జరగాల్సి ఉండగా.. ఈ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతున్నది. ఉపాధ్యాయులంతా తమకు ఏ స్థానాల్లో పోస్టింగ్ వస్తుందోనన్న ఆందోళనలో ఉంటున్నారు. ఇక పూర్తిస్థాయిలో పుస్తకాలు, నోటుబుక్కులు మండలాలకు చేరలేదు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలల బడి వేళలు మారగా.. ఉదయం 9గంటలకే ప్రారంభం కానున్నాయి. గ్రామాల నుంచి పూర్తి స్థాయిలో బస్సు రవాణా లేకపోవడం ఇబ్బందిగా మారే అవకాశం ఉన్నది. ఇక ప్రతి నెలలో నాలుగో శనివారం నో బ్యాగ్ డే అమలు కానున్నది. అలాగే ప్రతిరోజూ అరగంట పాటు పాఠ్యపుస్తకాల పఠనం, కథల పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు చదివించేందుకు నిర్ణయించింది. పదో తరగతి విద్యార్థులకు 2025 జనవరి 10వ తేదీ నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ తరగతులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 28 వరకు 9వ తరగతి విద్యార్థుల సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయనున్నారు. అలాగే పాఠశాలల్లో యోగా, మెడిటేషన్ తరగతులు నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. కాగా పాఠశాలల్లో సమస్యలు ఎప్పటిలాగే ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన 'మనఊరు–మనబడి' పనుల నిర్వహణ అటకెక్కింది. దీని స్థానంలో తీసుకొచ్చిన 'అమ్మ ఆదర్శ' పాఠశాలల పథకం పేరుకు మాత్రమే అమలవుతున్నది. మన ఊరు–మనబడి పథకంలో భాగంగా ఎంపిక చేసిన స్కూళ్లల్లో రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయగా.. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద రూ.25వేలతో పనులు చేపట్టడం స్కూళ్ల నిర్వహణపై ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. చాలా స్కూళ్లల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా లేవు. పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడే దశలో ఉన్నాయి. మొత్తం మీద ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు పలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నది.


వనపర్తి తెలుగువాడి స్కూల్ ఆవరణలో మట్టి


మహబూబ్‌నగర్ గాంధీనగర్ రోడ్డు హైస్కూల్‌లో పనులు చేపడుతున్న కూలీలు

### వసతులు కల్పిస్తున్నాం..



అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు చేపడుతున్నాం. జిల్లాలో 778 ప్రభుత్వ పాఠశాలల్లో 60 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. బడిబాటను అమలు చేస్తున్నాం. ఉపాధ్యాయ బదిలీలు ఈ నెలాఖరుకు పూర్తవుతాయి. అదేవిధంగా 4.50లక్షల పాఠ్య పుస్తకాలతో పాటు 3.50లక్షల నోట్ బుక్కులను అందిస్తాం. అలాగే విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్కులను, యూనిఫాం అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

*- గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్*

## చెట్టంత నిర్లక్ష్యం

- ప్రమాదభరితంగా జడ్చర్ల నిమ్మబావిగడ్డ ప్రభుత్వ బడి భవనం
- గోడలోంచి చొచ్చుకెళ్లిన చెట్టు
- నెర్రెలిచ్చిన పాఠశాల భవనం
- భయాందోళనల్లో విద్యార్థులు

జడ్చర్ల టౌన్, జూన్ 11 : పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని నిమ్మబావిగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం ప్రమాదకరంగా మారింది. శిథిలావస్థలో ఉన్న భవనం వెనుక గోడలోంచి రావి చెట్టు పెరిగింది. చెట్టు కొమ్మలు, వేర్లు గోడలోకి చొచ్చుకుపోవటంతో కూలేదశకు చేరింది. పాఠశాల ముందు భాగంలో అందంగా ముస్తాబైనా.. వెనుక ఉన్న గోడలు మాత్రం నెర్రెలిచ్చాయి. ఇక్కడ ఒకటి నుంచి 5 వరకు గతేడాది వరకు 101 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు విద్యాబోధన చేశారు. అయితే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 'మన ఊరు–మన బడి'కి ఎంపికైనా.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు జరగలేదు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైంది. అయితే ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ముంపు పొంచి ఉన్నది. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం గోడలో పెరిగిన చెట్టు

## మోగనున్న బడిగంట

వనపర్తి టౌన్/నారాయణపేట రూరల్/గద్వాలటౌన్/పాలమూరు, జూన్ 11 : నేటి నుంచి బడిగంట మోగనున్నది. ఈనెల 6 నుంచి బడిబాట ప్రారంభమవగా.. హెచ్‌ఎంలు, టీచర్లు ఇప్పటికే గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వనపర్తి జిల్లావ్యాప్తంగా 697 పాఠశాలలు ఉండగా.. అందులో 527 ప్రభుత్వ పాఠశాలలు (359 ప్రైమరీ, 61 అప్పర్ ప్రైమరీ, 101 హైస్కూళ్లు) కేజీబీవీలు 15, గురుకులాలు 18, మోడల్ స్కూల్స్ 3 ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ సెక్టార్ పరిధిలో 6 హైస్కూళ్లు, ఒక యూపీఎస్, 15 ప్రాథమిక పాఠశాలలు.. జెడ్పీ పరిధిలో 319 ప్రాథమిక పాఠశాలలు, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు, 69 జెడ్పీ హైస్కూళ్లు.. 11 కేజీబీవీలు, 2 మోడల్ స్కూల్స్, 13 గురుకులాలు, 4 ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. గద్వాల జిల్లాలో హైస్కూల్స్, యూపీఎస్, కేజీబీవీలు మొత్తం కలిపి 496, ప్రభుత్వ ఎయిడెడ్ 2, 139 ప్రైవేట్ ఎయిడెడ్.. మొత్తంగా 640 పాఠశాలలు ఉండగా 1,22,980 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. పాలమూరు జిల్లా వ్యాప్తంగా 641 ప్రైమరీ, 208 యూపీఎస్, 275 హైస్కూల్స్ ఉన్నాయి. అదేవిధంగా 14 కేజీబీవీలు, 6 గురుకులాలున్నాయి.



వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో తోరణం కట్టిన దృశ్యం

## పారదర్శక పాలన అందించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి
- 'కరెంటు కష్టాలు' పెడితే చర్యలు : ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

వనపర్తి, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : పారదర్శక పాలన అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సంబంధించిన అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ నగేశ్ ఆధ్వర్యంలో వైద్యం, ఆరోగ్యం, విద్య, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల శాఖల వారీగా నెలకొన్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు మెచ్చేవిధంగా పారదర్శక పాలన అందించేందుకు అధికారులు పూర్తి సహకారం అందించాలన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు, ఖాళీలపై ఆరా తీశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెద్దగడ, పెద్దమరూర్‌లోని సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించమని స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు? వాటిలో పురోగతి ఎలా ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చిన విద్యుత్ ఫిర్యాదులను తప్పనిసరిగా స్వీకరించి పరిష్కరించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీరు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. భీమా, కల్వకుర్తి, పీఆర్ఎల్ఐ ఎత్తిపోతల పథకాల్లో చేపట్టాల్సిన భూసేకరణపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ, బీటీ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని, అవసరమైతే 60 సీ సెక్షన్ కింద పనిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి కొత్త టెండర్లు పిలవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ పరంగా చర్యలు తీసుకోవాలని.. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రేమద్దులలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని పూర్తిస్థాయిలో మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ శాఖ పరంగా ఉన్న భూ సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమీక్షలో జిల్లా అధికారులు, ఆర్డీవో, ఎంపీడీవోలు, తాసీల్దార్లు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో వనపర్తి కలెక్టర్, అదనపు కలెక్టర్

### సింగోటం బడికి రూ. 40లక్షలు..

కొల్లాపూర్, జూన్ 11 : మండలంలోని సింగోటం జెడ్పీ హైస్కూల్‌లో బాడిబాటలో భాగంగా అధికారులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, డీఈవో గోవిందరాజులుతో మంత్రి సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో డెమోగా ఈ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. మౌలిక సౌకర్యాల కోసం తన నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బడి బస్సు భద్రమేనా?

- 'ఫిట్'నెస్ లేకుంటే బస్సులు సీజే..
- ఉమ్మడి జిల్లాలో 1,264 స్కూల్ బస్సుల్లో 40 శాతమే ఫిట్
- ఆటోల్లో నలుగురికి మించి తరలించొద్దు
- ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరి
- నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

మహబూబ్‌నగర్, జూన్ 11 : నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వ బడులకు రవాణా సదుపాయాలు లేకపోయినా 'ప్రైవేట్'కు మాత్రం చాలా అవసరం. ప్రతి ఏడాది ప్రారంభంలో ఆయా స్కూళ్ల యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ఇందుకోసం రవాణా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,264 స్కూల్ బస్సులుండగా.. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. కానీ, నేటివరకు 40 శాతం బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చాయి. సామర్థ్య పరీక్షలు చేసుకోకపోతే వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

***వాహన చట్టానికి తూట్లు..***

బస్సుల నిర్వహణలో ఆయా పాఠశాలలు యాజమాన్యాలు వాహనాల చట్టానికి తూట్లు పొడుస్తున్నాయి. 32 నిబంధనల్లో సగాన్ని కూడా పాటించడం లేదు. అత్యవసర ద్వారాలను పిల్లలు తీస్తారనే ఉద్దేశంతో ముందుగానే వాటిని మూసి ఉంచుతున్నారు. దీంతో ప్రమాదం సంభవించినప్పుడు విద్యార్థులు తప్పించుకునే వీలు లేకుండాపోతున్నది. అగ్ని ప్రమాద సమయంలో ఉపయోగపడే యంత్రాలను సైతం అందుబాటులో ఉంచడం లేదు. ఫిట్‌నెస్ చెకింగ్ సమయంలో తీసుకొస్తున్న సామగ్రిని డ్రైవర్లు తదనంతరం అందుబాటులో ఉంచడం లేదు. బస్సు కొనుగోలు చేసిన సమయంలో వచ్చిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను కూడా మార్చడం లేదు. నిబంధనల్లోని ఏ ఒక్క అంశానికి కూడా రిజిస్టర్లు మెయింటేన్ చేయడం లేదు. చాలా చోట్ల వ్యాలిడిటీ అయిపోయిన బస్సులను నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. పుట్‌రెస్టులు ఎత్తుగా ఉండడంతో బస్సు ఎక్కేటప్పుడు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో క్లీనర్లను నియమించడం లేదనే విమర్శలున్నాయి. ఏటా మే 15వ తేదీ నాటికి పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ వ్యాలిడిటీ ముగుస్తుంది. దీంతో విద్యాసంస్థల యాజమాన్యాలు నిబంధనలకు అనుగుణంగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. అయితే ఈ ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం పొందకుండా వాహనాలు నడిపితే విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి. నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో బుధవారం నుంచి అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వ్యాలిడిటీ పూర్తయిన బస్సును అధికారులు గుర్తించి సీజ్ చేయనున్నారు. మహబూబ్‌నగర్‌లో 442, నారాయణపేటలో 129, నాగర్‌కర్నూల్‌లో 243, వనపర్తిలో 226, గద్వాలలో 224 స్కూల్ బస్సులున్నాయి.

### 60 శాతమే..

- గద్వాల జిల్లాలో 222 బస్సులు
- 139 వాహనాలకే ఫిట్‌నెస్


గద్వాల అర్బన్, జూన్ 11 : నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మోటరు వాహనాల చట్టం నిబంధనల మేరకు ఏడాదికోసారి బస్సుల సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్షలు చేయించాలి. కానీ జిల్లా వ్యాప్తంగా 222 బస్సులుండగా.. ఫిట్‌నెస్ పరీక్షకు మాత్రం 139 బస్సులే వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డుపైకొస్తే సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని రవాణాశాఖ ఇన్‌చార్జి అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 15 ఏండ్లు పైబడిన బస్సులను నడపొద్దని, విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు, ఇతర వాహనాలపై నిఘా ఉంచామన్నారు. డ్రైవర్లు మత్తు పదార్థాలు, మద్యం తాగకూడదన్నారు. 28వ తేదీలోగా పాఠశాల బస్సులన్నీ ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని సూచించారు.

### ఫిట్‌నెస్ లేకుంటే సీజ్..



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై సీరియస్‌గా దృష్టి సారిస్తు న్నాం. జిల్లాలో ఉన్న స్కూల్ బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. లేదంటే స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేస్తాం. విద్యార్థులను తరలించే ఆటోలపైనా చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ వాహన నిబంధనలను పాటించాలి. ప్రతి బస్సులో లాగ్‌బుక్ తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సమస్యలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకురావాలి. నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

*- వాసుదేవ్, జిల్లా ఇన్‌చార్జి రవాణా అధికారి, మహబూబ్‌నగర్*




### సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం బస్సు రోడ్డెక్కాలంటే 32 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ఫిట్‌నెస్, టైర్లు, సాంకేతిక సామర్థ్యం వంటి అంశాలపై అధికారులు పరిశీలించి సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు.
- డోర్లకు లాక్ సిస్టం, కిటికీలకు గ్రిల్స్ ఉండాలి.
- బస్సులకు పసుపురంగు వేయడంతోపాటు ముందు, వెనుక భాగంలో స్కూల్ బస్ ఆన్ స్కూల్ డ్యూటీ అని రాయించాలి.
- విద్యార్థుల బ్యాగుల కోసం ప్రత్యేక స్థలం ఉండాలి.
- డ్రైవర్‌కు హెవీ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి లైసెన్స్‌తో పాటు భారీ వాహనాలను నడపడంలో ఐదు, ఆరేండ్ల అనుభవం ఉండాలి.
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అటెండర్‌ను ఏర్పాటు చేయాలి.
- తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి.
- విద్యార్థులు పుట్‌పాత్‌పై ఉండకుండా చూసుకోవాలి.
- బస్సుల్లో నిత్యం ఫిర్యాదుల రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో పేర్కొన్న వాటిని తక్షణమే పరిష్కరించాలి.
- ప్రతి వాహనానికి కచ్చితంగా అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేసి.. దానిపై అత్యవసర ద్వారం అని స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- ప్రతి బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను అందుబాటులో ఉంచాలి. వారానికోసారి ప్రిన్సిపాల్.. నెలకోసారి పేరెంట్స్ కమిటీ దానిని తనిఖీ చేయాలి. వీటికోసం ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

WANTED TEACHERS
Required Teachers to teach in Geetham High School, Jadcherla
1. Pre Primary : 5 Posts
2. Primary : English, EVS & Maths
3. High School : Telugu & English, Social
Contact
9705028666, 7013492217, 7780592004
Interview date : 12th, 13th June, 2024
Time : 10 AM to 5 PM
Geetham HIGH SCHOOL (Reg. by Govt. of Telangana)
(E/M NURSERY - X CLASS) MAHABUBNAGAR - JADCHERLA